



గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో సాయిబాబా, దర్శనం చేసుకుంటున్న భక్తులు

గురుపౌర్ణమి సందడి

వ్యాస పౌర్ణమి సందర్భంగా పలు ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. సిద్దిపేటలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబాకి మహా హారతి, విశేష అభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

- సిద్దిపేట కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి)



కొల్లూరులోని సర్వే నంబరు 204లోని అక్రమ నిర్మాణం

వివాదాస్పద భూముల్లో

యథేచ్ఛగా నిర్మాణాలు

- కూల్చివేతకు హైకోర్టు ఆదేశం
- అయినా అధికారుల జాప్యం

7

- ఒకే భూమికి పలువురు యజమానులు

కల్లు తేలేస్తారు!

- భయపెడుతున్న కల్తీ 'కల్లో'లం
- జిల్లాలో జోరుగా విక్రయాలు

- తాటి, ఈత చెట్లు లేకున్నా ప్రవాహంలా తయారీ
- రసాయనాల మత్తులో తూగుతున్న బాధితులు
- నామమాత్రపు పర్యవేక్షణకే అధికారులు పరిమితం
- అంతా 'మామూలే' అన్నట్లుగా ఆబ్కారీశాఖ తీరు
- హైదరాబాద్ ఘటన నేపథ్యంలో కానరాని తనిఖీలు

కల్తీకల్లు తాగి తాజాగా హైదరాబాద్‌లో ఆరుగురు చనిపోయారు. 40మంది అస్వస్థతకులోనై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డిపోల్లో ఇష్టారాజ్యంగా రసాయనాలు కలిపిన కల్లు సేవించడమే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. అయితే సిద్దిపేట జిల్లాలోని కల్లు డిపోలు, కల్లు దుకాణాల్లోనూ రసాయనాల మత్తు గుప్పుమంటోంది. ఒక్కసీసా కల్లు తాగితే చాలు మైమరచిపోయి ఎక్కడపడితే అక్కడే కుప్పకూలిపోతున్నారు. స్వచ్ఛమైన తాటి, ఈత కల్లు పేరిట జోరుగా ఈ మత్తు దందా సాగుతున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ నామమాత్రమే అవుతున్నది. అంతా 'మామూలే' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 10



కుకునూరుపల్లిలోని కల్లు దుకాణంలో సీసాలు


జిల్లాలో 385 కల్లు దుకాణాలు ఉన్నాయి. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకలో డిపోలను నిర్వహిస్తున్నారు. నిషేధిత మత్తు పదార్థాలైన క్లోరో హైడ్రైడ్, డైజోఫామ్, ఆల్ప్రాజోలం తదితర రసాయనాలను చాలా దుకాణాల్లో కలుపుతున్నారు. ఒక లైసెన్సు ఉంటే ఒక దుకాణమే నిర్వహించాలి. కానీ ఒక్కో లైసెన్సు పేరిట ఇష్టారాజ్యంగా దుకాణాలను నడిపిస్తున్నారు.



సిద్దిపేటలోని ఓ కల్లు దుకాణం

ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా..

ఉదయం 7 గంటలకే కల్లు దుకాణాలు తెరుచుకుంటున్నాయి. ఇంకేముంది కల్తీకల్లు ప్రియులు దుకాణాల్లో గంటల తరబడి అడ్డా వేస్తున్నారు. మత్తు కలిపిన కల్లు తాగి అక్కడే పడిపోతున్న పరిస్థితి దాపురించింది. ఇంకొందరు అదే మత్తులో వచ్చి రోడ్లపై కుప్పకూలుతున్నారు. సిద్దిపేట బస్టాండ్ వద్ద కల్తీకల్లు బాధితుల చిత్రాలు నిత్యం కనిపిస్తూనే ఉంటాయి. అర్ధరాత్రి వరకు కల్లు దుకాణాలను తెరిచే ఉంచుతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన ఆబ్కారీ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు సైతం ఈ దిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.



కల్తీకల్లు మత్తులో సేదతీరుతున్న వ్యక్తి

మండువలో రూ.100.. దుకాణంలో రూ.15

తాటి, ఈత చెట్లు ఉండే మండువాల్లో స్వచ్ఛమైన కల్లు లీటరుకు రూ.100 దాకా పలుకుతోంది. కల్లు ఉత్పత్తి ఎక్కువగా ఉంటే రూ.100కు 2లీటర్లు అమ్ముతుంటారు. కానీ కల్తీకల్లు విక్రయించే దుకాణాల్లో లీటరుకు రూ.15 మాత్రమే తీసుకుంటున్నారు. ఈ ఒక్క విషయంలోనే అసలు, నకిలీ తేడా ఏంటో అర్థమవుతోంది. నీళ్లలో రసాయనాలు కలపడం వల్ల పెద్దగా ఖర్చేమీ ఉండదు. కాబట్టి తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లుగా తెలుస్తోంది. మద్యం ధరలు పెరగడం, స్వచ్ఛమైన కల్లుకు అధిక ధర పలుకుతుండడంతో మద్యం ప్రియులు సైతం కల్తీ కల్లు దుకాణాల వైపు చూస్తున్నారు.

మిగతా 8వ పేజీలో

గ్రామానికో ఆదర్శ రైతు

- నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు
- వారి ద్వారానే ప్రభుత్వ పథకాల అమలు
- గతంలో అన్ని శాఖలను సమన్వయం చేయడంలో కీలకం
- తాజా నియామకంలో ప్రాధాన్యత కాంగ్రెస్ కార్యకర్తలకా? రైతులకా?

గజ్వేల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికో ఆదర్శరైతును నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆదర్శ రైతు వ్యవస్థను తీసుకువచ్చారు. ఆదర్శ రైతుల ద్వారానే ప్రభుత్వ పథకాలను రైతులకు అందజేశారు. అనంతరం వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం ఆదర్శ రైతు వ్యవస్థను రద్దు చేసి, రైతుబంధు సమితిని ఏర్పాటు చేసింది. తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు వ్యవస్థను రద్దు చేయడంతో పాటు గ్రామానికో ఆదర్శ రైతును నియమించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తుంది. గతంలో ఆదర్శ రైతులకు గౌరవ వేతనం కింద రూ.1000 ప్రభుత్వం అందజేసింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురానున్న ఆదర్శ రైతు వ్యవస్థలో గౌరవ వేతనం ఉండబోదని స్పష్టం చేసింది.

వ్యవసాయ సంక్షేమ పథకాలను ఆదర్శ రైతుల ద్వారా అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటన చేయగా, తాజాగా రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ప్రకటించడంతో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆశలు రేకెత్తాయి.

కీలకంగా పనిచేసిన ఆదర్శ రైతులు

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆదర్శ రైతులు కీలకంగా పనిచేశారు. ఆత్మ కార్యక్రమాల ద్వారా రైతులను చైతన్యం చేయడం, విత్తనోత్పత్తి వైపు రైతులను మళ్లించడం, రైతు చైతన్య యాత్రలు, రైతు విజ్ఞాన యాత్రలతో రైతులకు మెలకువలు నేర్పించడం, పంట నష్ట పరిహారం అంచనా వేయడంతో పాటు నిజమైన రైతులకు నష్టపరిహారం అందేలా చేయడం, నిజమైన రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేసే కార్యక్రమాలు చేపట్టారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబీమా అందజేయడం, రైతు భరోసాను ఆన్‌లైన్ చేయడం, వ్యవసాయ పనిముట్ల పంపిణీ, సబ్సిడీ విత్తనాలను రైతులకు అందజేయడం, హర్టికల్చర్ ద్వారా పందిరి సాగు, కూరగాయల సాగు, మామిడి తోటల సాగు ద్రాక్ష సాగు, వెటర్నరీ శాఖ ద్వారా పశు సంపద పెంపుదల చేయడం, విద్యుత్ శాఖ ద్వారా రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చేయడం, సెరికల్చర్ ద్వారా పట్టు పరిశ్రమ వైపు రైతులను మళ్లించడం, రైతులకు వ్యవసాయంలో ఉపాధి హామీ పథకాలను వర్తింపజేయడంతో పాటు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపటిన ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులను మళ్లించేందుకు ఆదర్శ రైతులు ఉపయోగపడతారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

అధికారులకు చేదోడు.. వాదోడుగా

ఆదర్శ రైతులు అందుబాటులోకి వస్తే జిల్లా వ్యవసాయాధికారితో మొదలుకుని వ్యవసాయ విస్తరణాధికారి వరకు అందరికీ చేదోడు వాదోడుగా ఉండే అవకాశాలున్నాయి. పంట నష్టపరిహారం, పంటల సాగు నమోదు ప్రక్రియ, విత్తనోత్పత్తి, ఆయిల్‌పామ్ సాగు ఇతరత్రా కార్యక్రమాల్లో ఆదర్శ రైతులు వ్యవసాయాధికారులకు అండగా నిలిచే అవకాశం ఉంది. కానీ ఆదర్శ రైతులకు పకడ్బందీ నిబంధనలను పెట్టని పక్షంలో ఏకపక్షంగా వ్యవహరిస్తే

మిగతా 8వ పేజీలో



జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించాలి

- లేదంటే రద్దు చేస్తాం
- కలెక్టర్ హైమావతి హెచ్చరిక

జగదేవ్‌పూర్, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు వేగంగా పనులు మొదలుపెట్టాలని కలెక్టర్ హైమావతి సూచించారు. జగదేవ్‌పూర్‌తో పాటు తిగుల్‌లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియను కలెక్టర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జగదేవ్‌పూర్ గ్రామానికి 42 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని 17మంది లబ్ధిదారులు గ్రౌండింగ్ పూర్తిచేశారని, మరో పదకొండు మంది కట్టుకోని వారు ఉన్నారని మండల అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మంజూరు పత్రాలు తీసుకున్న లబ్ధిదారులు ఇళ్ల పనులు మొదలు పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఇళ్లు మంజూరై కట్టుకోవడానికి సుముఖంగా లేని వారి నుంచి గ్రామసభ నిర్వహించి కట్టుకోకపోవడానికి గల కారణాలు అడిగి వారి దగ్గర నుంచి లిఖితపూర్వకంగా రద్దుపత్రాన్ని రాయించుకుని అర్హులైన మిగతా లబ్ధిదారులకు మం జూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వితంతువులకు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి ఇళ్లను మంజూరు చేయాలన్నారు.

ఇద్దరు హెచ్‌ఎంలకు మెమోలు జారీ...

తిగుల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, బీసీ, ఎస్సీ హాస్టల్స్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైస్కూల్, ప్రైమరీ స్కూళ్లలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లేకపోవడంతో పాఠశాలలోని వంట మనుషులు, ఇద్దరు హెచ్‌ఎంలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు హెచ్‌ఎంలకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ హైమావతి ఆసుపత్రికి వచ్చే రోగులతో దురుసుగా మాట్లాడవద్దని సూచించారు.

ఒక్కరోజు సంబురమే..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో కలగానే ఎగ్ బిర్యానీ
- ఇప్పటికీ పాత మెనూ కొనసాగింపు..

సిద్దిపేట అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల కోసం కొత్త మెనూ రూపొందించి ఎగ్ బిర్యానీ చేర్చాలని తీసుకున్న నిర్ణయం ఒక్కరోజు సంబురంగానే మిగిలింది. జిల్లాలో 267 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. పాత మెనూ సవరించి కొత్త మెనూ ప్రకారం ఎగ్ బిర్యానీ చేర్చారు. అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభం కాగానే జిల్లావ్యాప్తంగా ఆయా కేంద్రాలకు అధికారులు తనిఖీలకు వస్తారని భావించి ఎగ్ బిర్యానీ అందించారు. ఇక ప్రతీవారం ఎగ్ బిర్యానీ పెడతారని ఆశపడ్డ పిల్లలకు ప్రతీవారం నిరాశే ఎదురవుతుంది. ప్రస్తుతానికి పాత మెనూనే కొనసాగిస్తున్నారు. వారానికి రెండు రోజులు పప్పు, ఆకుకూరలు. బుధవారం ఒకరికి రెండు గుడ్లు, ఒక రోజు ఎగ్ కర్రీ పాత మెనూ ప్రకారం అందిస్తున్నారు. కొత్తమెనూ పై పలువురు తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రశ్నించగా ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదని కేవలం ఒక్కరోజు మాత్రమే అందించాలని సూచనలు వచ్చాయని అధికారులు చెప్పినట్లు సమాచారం.





షీ టీం రక్షణగా ఉండాలి

- సమీక్షలో సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం/గజ్వేల్ జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న షీటీమ్స్ మహిళలకు బాలికలకు రక్షణగా పని చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. షీ టీమ్స్ భరోసా సిబ్బందితో మహిళల, పిల్లల రక్షణ గురించి తీసుకుంటున్న చర్యలపై కమిషనర్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. సంబంధిత ఏసీపీలు వారానికి ఒకరోజు షీటీమ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించాలని సూచించారు. కాలేజీలు, స్కూళ్లలో గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యార్థులు సోషల్ మీడియాకు ఆకర్షితులవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. సమీక్షలో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశం గౌడ్, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్,



మూడు డివిజన్ల షీటీమ్ సిబ్బంది, సిద్దిపేట భరోసా సెంటర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

- డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల నివారణకు కృషి చేయాలని గజ్వేల్ నూతన ఎస్‌ఐలకు సీపీ సూచించారు. గజ్వేల్ ఎస్‌ఐలుగా రఘుపతి, శ్రీరామ్ ప్రేమ్‌దీప్‌లు బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీపీని కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె వారిని అభినందించి పలు సూచనలు చేశారు.

మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపు

- రూ.1,04,35,711నగదు, 120 గ్రాముల బంగారం, 6.100కిలోల మిశ్రమ వెండి, 42 విదేశీ కరెన్సీ నోట్లు లభ్యం

చేర్యాల, జూలై 10(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం కానుకలు, ఒడిబియ్యం హుండీలను లెక్కించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో, ఈవో అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఆలయ ముఖమండపంలో భ్రమరాంబ సేవాసమితి సభ్యులు కరెన్సీ లెక్కించారు. లెక్కింపుల ద్వారా రూ.1,04,35,711 నగదు, 120 గ్రాముల మిశ్రమ బంగారం, 6.100 కిలోల మిశ్రమ వెండి, 42 విదేశీ కరెన్సీ, 16 క్వింటాళ్ల ఒడిబియ్యం లభ్యమయ్యాయి. ఈ ఆదాయం 55 రోజుల్లో సమకూరింది. ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ధర్మకర్తలు మామిడాల లక్ష్మి, లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, సూపరింటెండెంట్‌లు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు పాల్గొన్నారు.

ఆలయంలో వేలంపాట

మల్లన్న ఆలయంలో గురువారం పలు అంశాలకు సంబంధించి వేలంపాట నిర్వహించారు. సిద్దిపేటకు చెందిన కె.సందీప్ నిత్యపూజ పూలు, పూలదండల సరఫరా హక్కు పొందాడు. అన్నదాన సత్రం పక్కన షాప్ నంబర్-10 లీజు నెలకు రూ.5,800 చొప్పున లీజ్ ఇచ్చారు. అలాగే ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కూల్‌డ్రింక్స్ షాపు ఏర్పాటు వాయిదా పడింది.



కార్యాలయంలో కూర్చుని పనులు చేసుకుంటున్న సిబ్బంది

విద్యుత్ పునరుద్ధరణ

- కార్యాలయంలో వెలిగిన లైట్లు, తిరిగిన ఫ్యాన్లు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హుస్నాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని వరద కాలువ గౌరవెల్లి ప్రాజెక్టు డివిజన్-3 కార్యాలయానికి విద్యుత్‌ను పునరుద్ధరించారు. బిల్లుల పెండింగ్‌తో కరెంట్ కట్ చేయడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారని 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో బుధవారం 'బకాయిల దెబ్బకు బయటే డ్యూటీ' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం కార్యాలయానికి కనెక్షన్ ఇచ్చారు. కార్యాలయంలో ఫ్యాన్లు, లైట్లు వెలిగాయి. రెండేళ్లుగా బయట కూర్చుని పనులు చేసే అధికారులు సంతోషంగా లోపల నిర్వహిస్తున్నారు. తమకు ఇబ్బందులు లేకుండా చేసిన 'ఆంధ్రజ్యోతి'కి కార్యాలయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరు మృతి

గజ్వేల్ రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని కొల్గూర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రోళ్ల ప్రశాంత్(21) పొలం పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లికి చెందిన గాజులపల్లి రాజిరెడ్డి(38) గజ్వేల్ నుంచి తొగుట వెళ్తున్నాడు. మార్గంమధ్యలో కొల్గూర్ శివారులోని నర్సరీ వద్ద ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలో ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి ఇద్దరు మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ

మెదక్ అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : సోహం అకాడమీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల, నూతన ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ (మాచవరం), జెడ్పీహెచ్ఎస్(కొల్చారం), జెడ్పీహెచ్ఎస్(రంగంపేట) పాఠశాల విద్యార్థినులకు రోబోటిక్స్ ఇన్ ఆకాడమిక్స్ కార్యక్రమం నిర్వహించారు. 8, 9వ తరగతుల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించి సాంకేతికతపై అవగాహన కల్పించారు. రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలపై శిక్షణ అందించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.హుస్సేన్, డీఎస్‌వో రాజిరెడ్డి, ఎంఈవోలు శంకర్, సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులను సాంకేతిక ఆవిష్కరణల వైపు నడిపించడమే ప్రధాన లక్ష్యంతో అకాడమీ కృషి చేస్తుందన్నారు.

ఇంకుడు గుంతలేవి?

- అడుగంటిన భూగర్భ జలాలు
- వానాకాలంలోనూ తప్పని నీటి ఎద్దడి
- ట్యాంకర్ల కోసం ప్రజల పడి కాపులు
- నిద్రావస్థలో పంచాయతీ యంత్రాంగం



అంబేద్కర్ కాలనీలో భూగర్భజలాలు అడుగంటడంతో పని చేయని పంచాయతీ బోరు, గతంలో కంది శివారులో నిర్మించిన ఇంకుడుగుంత నమూనా

కంది, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కాంక్రీట్ జంగిల్‌గా మారిన సంగారెడ్డి జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉన్న కందిలో చుక్క వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేదు. మెజార్టీ కుంటలు ఆక్రమణకు గురయ్యాయి. అంగుళం స్థలం వదలకుండా బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రభుత్వ ఖాళీస్థలాలు, పార్కులు, కార్యాలయాల ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఏ విభాగమూ పట్టించుకోవడం లేదు. గతంలో భవనాల ప్రాంగణాలు, ప్రభుత్వ భవనాలు పల్లె ప్రకృతిపార్కుల్లో ఇంకుడు గుంతలు నిర్మించారు. కొన్నేళ్ల క్రితం నుంచి వాటి ప్రక్రియను పంచాయతీ అధికారులు, వాటర్‌బోర్డులు నిలిపివేశాయి. అంతకు ముందు నిర్మించిన వాటి నిర్వహణనూ పట్టించుకోవడం లేదు. వాస్తవంగా ఏటా ఇంకుడుగుంతల్లో ఉండే వ్యర్థాలు తొలగించాలి. అవసరాన్ని బట్టి కంకర, ఇసుక వంటివి నింపాలి. ప్రాంగణంలోని వర్షపు నీరు ఇంకుడుగుంతలోకి వస్తుందా? లేదా? చూడాలి. కానీ వీటిని పట్టించుకునే నాథుడే లేడు. లెక్కల్లో చూపేందుకు ఇంకుడు గుంతలు నిర్మించి గాలికొదిలేశారు.

నిబంధనలు ఇలా... నిర్మాణం ఎక్కడ?

హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం 100 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే భవనాల ప్రాంగణంలో ఇంకుడు గుంత తప్పనిసరి. ఇళ్ల నిర్మాణాలకు పర్మిషన్ తీసుకునేటప్పుడు ప్లాన్లోనూ ఎక్కడ ఇంకుడు గుంత నిర్మించేది స్పష్టంగా పేర్కొనాలి. 200 చ.మీలలోపు స్థల విస్తీర్ణం, గ్రౌండ్ ప్లస్ ఒక అంతస్తు లేదా జీప్లస్ రెండంతస్తులు (ఏడు మీటర్లు) నిర్మించే భవనాలకు నివాసయోగ్య పత్రం అవసరం లేదు. దీనిని అవకాశంగా మార్చుకుంటున్న భవన యజమానులు ఇంకుడు గుంతలను ప్లాన్లకే పరిమితం చేస్తున్నారు. ఇక 200 చ.మీల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే భవనాలకు నివాసయోగ్య పత్రం(ఎన్‌ఓసీ) తప్పనిసరి. అనుమతి తీసుకున్న ప్లాన్ ప్రకారం భవనం నిర్మించారా? ఇంకుడు గుంత ఉందా? అన్నది పరిశీలించి ఎన్‌ఓసీ ఇవ్వాలి. కానీ మెజార్టీ భవనాల విషయంలో దీనిని అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పరిశీలిస్తే తప్ప ఇంకుడుగుంత విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. గత మూడేళ్లలో కంది పరిధిలో 500పైగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. అధికారిక లెక్కల ప్రకారం కేవలం 10 శాతం నిర్మాణాల్లో మాత్రమే ఇంకుడు గుంతలున్నాయి. మేజర్ గ్రామ పంచాయతీ కంది మొత్తంగా నిర్మాణాలను పరిగణనలోకి తీసుకుంటే ఇంకుడుగుంతలు ఐదు శాతంలోపే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు.

ప్రైవేట్ ట్యాంకర్లకు డిమాండ్

కందిలో ఇంకుడుగుంతలు లేక భూగర్భజలాలు అడుగంటంతో ప్రైవేట్ ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. పంచాయతీ ట్యాంకర్ నుంచి సరఫర చేసే నీరు అందరికీ సరిపోక ప్రేవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి. 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించిన భవనాల్లో ఇంకుడు గుంత లేకుంటే రూ.500 నుంచి రూ.1000 వసూలు చేస్తున్నారు. వానాకాలంలో కూడా భూగర్భ జలాలు తగ్గడంతో ట్యాంకర్ల మీద ఆధారపడిన వారు అదనంగా సమర్పించుకోవాల్సి వచ్చింది. ఇంకుడుగుంతలు తప్పనిసరి అని చెబుతున్న అధికారయంత్రాంగం గతంలో నిర్మించిన ఇంకుడుగుంతల నిర్వహణను పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు పౌరులకేనా? ప్రభుత్వ విభాగాలకు వర్తించవా? అని కంది గ్రామస్థులు మండిపడుతున్నారు.

మదర్సాపై ఒరిగిన విద్యుత్ స్తంభం
12 మంది విద్యార్థులకు అస్వస్థత

కంది, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గాలివానకు మదర్సాపై విద్యుత్ స్థంభం ఒరగడంతో పొగ, నిప్పురవ్వలతో 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు ఊపిరి ఆడక తీవ్ర ఇబ్బంది పడ్డారు. కంది మండలం పరిధిలోని కౌలంపేట గ్రామంలో గురువారం రాత్రి పది గంటల తర్వాత జరిగిన ఈ ఘటన వివరాలు.. గురువారం రాత్రి అకస్మాత్తుగా గాలివాన వచ్చింది. గ్రామంలోని మదర్సా పక్కనే నేషనల్ హైవే 65 రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కొత్తగా విద్యుత్ స్తంబాలు వేశారు. గాలివాన ధాటికి ఓ విద్యుత్ స్థంభం ఒరిగి, మదార్సాలోని ఓ మినార్‌పై పడింది. దీంతో అక్కడ మెరుపులు, పొగలతో కూడిన నిపురవ్వలు ఎగసిపడ్డారు. మదర్సాలు ఉన్న దాదాపు 12 మంది విద్యార్థులు ఊపిరి ఆడక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్పందించిన గ్రామ మాజీ సర్పంచ్ షఫీబాబా, మదర్సా కమిటీ అధ్యక్షుడు బాబాసాహెబ్ సహకారంతో విద్యార్థులను సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు విద్యార్థులకు చికిత్స అందజేశారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి మెరుగ్గానే ఉందని డాక్టర్లు తెలిపారు. టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాతతతజగ్గారెడ్డి వెంటనే స్పందించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కోరారు. అనంతరం విద్యార్థులను ఎంఐఎం నాయకులు, గ్రామస్థులు పరామర్శించి ధైర్యం చెప్పారు. విద్యుత్ అధికారులు కూడా విద్యార్థులను పరామర్శించి, మదర్సాకు దూరంగా కవలంపేటలో 33/11 కేవీ లైన్ ఏర్పాటుకు ఆదేశించారు.



సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మదర్సా విద్యార్థులు

6.4కిలోల ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి, జూలై10 (ఆంధ్రజ్యోతి): పోలీసులు మహ్మద్ సమీర్ అనే వ్యక్తి వద్దనుంచి 6.4కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గంజాయి నిషేదం ఉందని, దానిని కొనుగోలు చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ హెచ్చరించారు. అక్రమంగా కర్ణాటక రాష్ట్రం బీదర్‌లోని ఇరానీ గల్లీలో ఓ వ్యక్తి ఎండు గంజాయిని కొనుగోలుచేసి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గురువారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి కంకోల్ టోల్ ప్లాజా వద్ద మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్, ఏఎస్సై బక్కన్న, సిబ్బంది హనీఫ్, పాండు, సునీల్ తదితరులు వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో టీజీ09బి 0821 గల స్కూటీపై అనుమానం వచ్చింది. దీంతో స్కూటీని తనిఖీ చేయగా అందులో ఎండు గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించి నిందితుడైన మహ్మద్ సమీర్‌ను విచారించగా బీదర్‌లో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. పట్టుబడిన 6.4కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని నిందితుడైన మహ్మద్ సమీర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

మెదక్ కల్చరల్/రామచంద్రాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో అనుమానస్పద స్థితిలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. నగరంలోని ఫలక్‌నుమాకు చెందిన సాధికా బేగం(20) స్థానికంగా ఉంటున్న ఆటోడ్రైవర్ షేక్ అహ్మద్ (25)ను ఆరు నెలల క్రితం వివాహమాడింది. బుధవారం రాత్రి పనులు ముగించుకుని రోజుమాదిరిగానే భర్త ఇంటికి వచ్చాడు. భోజనం ముగించుకుని కిందకు వెళ్లాడు. అరగంట తరువాత గదికి వెళ్లేసరికి తలుపులు మూసి ఉన్నాయి. తలుపులు ఎంత తట్టినా తెరువక పోవడంతో తలుపులు బద్దలుకొట్టారు. ఇంట్లో చూసేసరికి సాధికా బేగం ఫ్యాన్‌కు వేలాడుతూ మృతిచెంది కనిపించింది. మృతురాలి తండ్రి సయ్యద్ ఇబ్రహీం ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.


కడుపు నొప్పి భరించలేక ఒకరు

కడుపు నొప్పి తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్ కోమరం భీం కాలనీలో చోటు జరిగింది. సీఐ రవీందర్ కథనం ప్రకారం...కోమరం భీం కాలనీలో నివాసముంటుంన్న శ్వేత(24) గత కొంత కాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. బుధవారం కడుపు నొప్పి భరించలేక ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు ఎస్సై మురళి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

తోటికోడలు తిట్టిందని..

ఇంటి ఆవరణలో జరిగిన గొడవలో తోటి కోడలు తిట్టిందన్న మనస్తాపంతో ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం మెదక్ మండల పరిధిలోని మాచవరం గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మాచవరానికి చెందిన గోవింద పురం లలిత (49) భర్త రాజయ్యతో కలిసి ఉంటుంది. రాజయ్య, తమ్ముడు పక్క ,పక్క ఇళ్లల్లోనే ఉంటున్నారు. వర్షాకాలం అవ్వడం ఇంటి ముందు బురద అవుతుందన్న కారణంతో లలిత ఇంటి ముందు మొరం పోయించుకుంది. దీంతో ఆమెకు తోటి కోడలు సంగీతకు మధ్య గొడవ జరిగింది. గొడవ విషయం తెలుసుకున్న సంగీత పుట్టింటి వారు వచ్చి లలితతో గొడవ పడి తిట్టినట్లు చెప్పారు. తోడి కోడలు, ఆమె తల్లి మరికొంత మంది కలిసి తిట్టడంతో మనస్తాపం చెందిన లలిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. లలితకు కొడుకు, కూతురు ఉన్నారు. భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్ రూరల్ పోలీసులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగురు మృతి



జయరాం (ఫైల్)

మనూరు/గజ్వేల్ రూరల్/వెల్దుర్తి, జూలై10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు పాంతాల్లో వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని యశ్వంతరావుపేట తాండాలో జరిగింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. యశ్వంతరావుపేట తాండాకు చెందిన నేనావత్ దుర్గ, జయరాం అన్నదమ్ములు. వీరికి భూమి పంపకం విషయంలో గతనెల 29న గ్రామంలోని పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. జయరాం కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఆ రోజు రాత్రి జయరాం తాండాలో ఉండి మరుసటి రోజు వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే జయరాం కిందపడిపోవడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సు టైర్ కింద పడి ఒకరు..

బస్సు వెనుక టైర్ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం మనూరు మండలం రాయిపల్లిలో జరిగింది. ఇందుకు సంబంధించి మనూరు ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నారాయణఖేడ్ ఆర్టీసీ డీపో బస్సు టీజీ1520083 జహీరాబాద్ వెళ్తుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని వ్యక్తి బస్సు వెనుక టైర్ కింద పడడంతో ముఖం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వ్యక్తి వయస్సు 30 సంవత్సరాలు ఉంటాయని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తి వివరాల కోసం విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పొలంలో బోర్లపడి మరొక వ్యక్తి

పొలంలో పనిచేస్తూ బోర్లపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గజ్వేల్ మండలంలో జరిగింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన బరిగేల చిన్న రాజయ్య(55) తన సొంత పొలంలో పనులు చేసుకుంటూ ప్రమాదవశాత్తు బొక్క బోర్ల పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వరకట్నం వేధింపులతో నిండు గర్భిణి మృతి

● భర్తే హత్యచేశాడని అనుమానం

టేక్మాల్ జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులతో ఓ నిండు గర్భిణీ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని మహ్మద్ పల్లి గ్రామంలో జరిగింది. హస్నన్ మహ్మద్ పల్లి గ్రామానికి చెందిన ఎక్కిల్ల మానస(17)కు మహ్మద్ గ్రామానికి చెందిన గంగమేశ్వర్‌కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వరకట్నంగా 5 తులాల బంగారం, ఒక బైక్‌ను ఇవ్వడానికి మానస తల్లిదండ్రులు అంగీకరించారు. ఒక తులం బంగారం, బైక్ బదులు లక్ష రూపాయాలతో పాటు ఇతర సామగ్రిని అందజేశారు. మిగతా నాలుగు తులాల బంగారం కరీఫ్ పంట చేతికొచ్చిన తర్వాత ఇస్తామని మానస తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. వివాహానికి ముందే గంగమహేశ్వర్‌ను వారి తల్లిదండ్రులు దత్తత తీసుకున్నారు. రెండు నెలలక్రితం బంగారం విషయంలో తండి బీరయ్యతో గంగమేశ్వర్ గొడవ పడ్డాడు. మానస 9నెలలు గర్భవతి కావడంతో ప్రసవం నిమిత్తం కూతురును పుట్టింటికి పంపిచమని ఆమె తల్లిదండ్రులు అత్తింటివారు పంపిచలేదు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మానస ఉరేసేకుంది. గంగమహేశ్వర్ ఇంటికి వచ్చి ఉరేసుకున్న మానసను చూసి తన స్వగ్రామమైన పెద్ద శంకరంపేట మండలం మూసాయిపేటకు పారిపోయాడు. సమచారం అందుకున్న మానస తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. వరకట్నం పేరుతో వేధించి మానసను భర్త గంగమహేశ్వర్ హత్యచేసి, తన స్వగ్రామానికి పారిపోయాడని మానస తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలాన్ని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పరిశీలించారు

ఆరు ఎకరాలు అలవోకగా!

నాట్లు వేస్తున్న మగ కూలీలు
ఉత్తరాది రాష్ట్రాల నుంచి రాక

తూప్రాన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పాత చొక్కాలను చీరలపైనుంచే తొడుక్కుని, ఉదయం పొద్దుపొడిచాక పొలంలోకి దిగి ముచ్చటలాడుతూ, పాటలు పాడుతూ, రోజుకు మూడెకరాలకు మించి నాట్లు వేయలేని ఆ దృశ్యాల స్థానంలో.. ఇప్పుడు బురద పొలంలోకి దూకి, ఏక బిగిన ఆరు ఎకరాల వరకు నాట్లు వేసేస్తున్న మగ కూలీలు కనిపిస్తున్నారు. పైగా, స్థానిక కూలీల కంటే తక్కువ ధరకే వీరు పనులు చేస్తుండటం విశేషం.

గత్యంతరం లేక.. ఉత్తరాది కూలీలతో

ఉమ్మడి జిల్లాలో కొంతకాలంగా కూలి ధరలు విపరీతంగా పెరిగాయి. దీనికి తోడు, స్థానికంగా కూలీలు దొరకడం కూడా కష్టంగా మారింది. గతంలో ఈ కూలీల కొరతను నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల నుంచి వచ్చిన కూలీలు తీర్చగా, గత సీజన్ వరకు పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన కూలీలు ఆ లోటును భర్తీ చేశారు. ఇక ఈ సీజన్‌లోనైతే పరిస్థితి మరింత మారిపోయింది. ఏకంగా ఉత్తరాది నుంచి కూలీలు వస్తున్నారు. వీరంతా మగ కూలీలే కావడం గమనార్హం. గత నాలుగు రోజులుగా తూప్రాన్ చుట్టుపక్కల నాట్లు వేస్తున్న వారంతా ఉత్తరప్రదేశ్(యూపీ) కూలీలే. ఎకరం పొలం నాటు వేసేందుకు వీరు రూ.5000 వరకు తీసుకుంటున్నారు. గతంలో కూలీలు లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు ఈ ఉత్తరాది కూలీల రాక కొంతమేర ఊరటనిచ్చింది. వారు స్థానిక కూలీల కంటే తక్కువగా కూలి తీసుకోవడంతో రైతులంతా వారి వైపే మొగ్గుచూపుతున్నారు. ప్రత్యేకంగా వారిని రప్పించుకుని మరీ నాట్లు వేయించుకుంటున్నారు. యూపీ కూలీలు వరి నాట్లను కాస్త దూరందూరంగా వేస్తున్నప్పటికీ, గత్యంతరం లేక రైతులు వారితోనే పనులు చేయించుకోవాల్సి వస్తోందని కొందరు రైతులు తెలిపారు. నాట్లు కొంచెం దూరంగా ఉన్నా, పని మాత్రం వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు.


తూప్రాన్ శివారులో వరినాట్లు వేస్తున్న యూపీకి చెందిన కూలీలు

13 మందిమి వచ్చాం..



మేము యూపీ నుంచి 13 మంది జట్టుగా వచ్చాం. దాదాపు 15 రోజుల్లో నాట్లు వేయడం పూర్తి చేసుకుని వెళ్లిపోతాం. ప్రతీ రోజు ఆరు ఎకరాల వరకు వరి నాట్లు వేస్తాం. ఈ 13 రోజుల్లో ఎంతో కొంత ఉపాధి లభిస్తుంది.

- పురంజయ్, యూపీ కూలి



బెంగాల్ కూలీల నాట్లు



ఉదయం పొద్దుపొడవక ముందే సిద్దిపేట కోమటిచెరువు పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో నాట్లు మొదలవుతున్నాయి. ఎర్రటి ఎండ పలకరించే సమయానికే వారి చేతులు వేగంగా వేసేస్తున్నాయి. అలసటన్నదే లేనట్లు, అలవాటు పడ్డ యంత్రాల్లా పనిచేస్తున్నారు. వారంతా పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన 25 మంది కూలీలు. ఎకరానికి దాదాపు రూ.5000 కూలీని తీసుకుంటూ, గంటన్నర సమయంలోనే ఎకరంలో నాట్లు పూర్తిచేస్తున్నారు. వీరు నాట్లు తొందరగా వేస్తున్నారని, అందులోనూ తక్కువ కూలీకే చేస్తున్నారని, చౌక బేరమని రైతులు తెలిపారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

హాస్టల్ విద్యార్థుల కోసం గేటు ఓపెన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


గేటు ఓపెన్ చేసి హాస్టల్ నుంచి స్కూళ్లకు విద్యార్థులను పంపిస్తున్న హెచ్ఎం

శివ్వంపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : 'హెచ్ఎం వైఖరి కారణంగా వసతి గృహం విద్యార్థులకు అవస్థలు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. హాస్టల్ ముందు గేటు తాళం వేయడంతో విద్యార్థులు జాతీయ రహదారి పైనుంచి వెళ్లాల్సి వస్తుండడంతో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ విషయం తెలుసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు హెచ్ఎం బాలచంద్రం హాస్టల్ ప్రధాన ద్వారం ఎదుట ఉన్న స్కూళ్లకు వెళ్లే గేటు తాళం తీయించారు. ఆ గేటు ఓపెన్ చేసి, హాస్టల్ విద్యార్థులను అనుమతించారు. ఈ మేరకు గిరిజన బాలుర వసతి గృహం విద్యార్థులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సంగారెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ


నూతన సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న జీజీహెచ్ డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వి.మురళీకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ ఎంజీఎం పీడియాట్రిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణకు ప్రభుత్వం అదనపు డీఎంఈగా పదోన్నతి కల్పించి ఇక్కడికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో సంగారెడ్డి బోధనాస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డా.మురళీకృష్ణకు పలువురు డాక్టర్లు, వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ అనీల్‌కుమార్, ఆర్ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్, వైద్యులు సిబ్బంది ఉన్నారు.

అనుమతి లేకుండా తరగతి నిర్వహణ.. యూనిఫామ్ విక్రయాలు

- రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని స్కూల్‌కు ఎంఈవో నోటీసుల జారీ
- యూనిఫామ్‌లు విక్రయిస్తున్న గది సీజ్

తూప్రాన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో జాతీయ రహదారికి సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఉన్నత పాఠశాలకు ప్రీప్రైమరీ నుంచి 8వ తరగతి వరకు మాత్రమే అనుమతి ఉన్నది. నిబంధనలకు విరుద్ధంగా 9వ తరగతి నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తూప్రాన్ మండల విద్యాధికారి డా.పర్వతి సత్యనారాయణ గురువారం ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 9వ తరగతిని నిర్వహిస్తున్నారనే విషయం బయటపడింది. అంతేకాకుండా విద్యాశాఖ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాల ప్రాంగణంలో యూనిఫాంలను విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధింత పాఠశాల యాజమాన్యానికి తక్షణమే 9వ తరగతిని నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు. యూనిఫామ్ విక్రయిస్తున్న గదిని సీజ్ చేసినట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే విద్యాశాఖ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎంఈవో సత్యనారాయణ హెచ్చరించారు.

పనికి టాటా.. బడి బాట

కొనసాగుతున్న 'ఆపరేషన్ ముస్కాన్'
బాలకార్మికులకు పని నుంచి విముక్తి
శిశు సదనాల్లో పునరావాసం
ఇప్పటివరకు 21 మంది పిల్లల గుర్తింపు
పనిలో పెట్టుకున్న ఐదుగురిపై కేసులు

ఆర్థిక ఇబ్బందులు, ఇతల కారణాలతో చదువు మాన్పించి పనిలోకి పెట్టిన పిల్లల గుర్తింపు కార్యక్రమం సంగారెడ్డి జిల్లాలో ముమ్మరంగా సాగుతున్నది. ఇప్పటివరకు 21 మంది బాలబాలికలకు పని నుంచి విముక్తి కల్పించారు. మైనర్లను పనిలో పెట్టుకున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశారు.

సంగారెడ్డి క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పెన్ను, పుస్తకం పట్టాల్సిన చిట్టి చేతులు మట్టి పని చేయాల్సి వస్తోంది. జిల్లాలో అనేక మంది బడి వయసు పిల్లలు బడికి వెళ్లకుండా బాల కార్మికులుగా పనిచేస్తున్నారు. నిరక్షరాస్యత, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితుల కారణంగా చిన్నారులు వివిధ పనులకు వెళ్లాల్సి వస్తోంది. తల్లిదండ్రులు లేని మరికొందరు పిల్లలు, తల్లిదండ్రులు ఉండి కూడా నిరాదరణకు గురవుతున్న ఇంకొందరు పిల్లలు భిక్షాటన చేస్తున్నారు. ఇలా చాలా మంది పిల్లలు హోటళ్లు, ఇటుక బట్టీల వద్ద, ఇతర పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇలాంటి పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నుంచి 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జిల్లా మహిళా సంక్షేమ శాఖ, కార్మిక, పోలీసు అధికారులు, బాలల సంరక్షణ కమిటీలు సంయుక్తంగా జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీల వద్ద, దుకాణాలు, చిన్న చిన్న పరిశ్రమలలో ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో వీధి బాలలను, బాల కార్మికులను, భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తిస్తున్నారు.



ఆపరేషన్ స్మైల్ ద్వారా గుర్తించిన పిల్లలు

సంవత్సరం	పిల్లలు
2022	77
2023	112
2024	83
2025	98

ఆపరేషన్ ముస్కాన్‌లో..

2022	91
2023	56
2024	84

ఆరు నెలలకు ఒకసారి ఆకస్మిక తనిఖీలు

బాల కార్మికులను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం సంవత్సరంలో ఆరు నెలలకు ఒకసారి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుంది. ప్రతి సంవత్సరం జనవరి నెలలో 'ఆపరేషన్ స్మైల్' పేరిట, జూలై నెలలో 'ఆపరేషన్ ముస్కాన్' పేరిట ఈ తనిఖీలు చేపడతారు. హోటళ్లు, ఇటుక బట్టీల వద్ద, పరిశ్రమలు, దుకాణాల్లో దాడులు నిర్వహించి 18 సంవత్సరాల లోపు బాల కార్మికులను గుర్తించి వారిని శిశు సదనాలకు తరలిస్తారు. అనంతరం బడిలో చేర్పిస్తారు.



బడిలో చేర్పిస్తాం..



పని ప్రదేశాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించడంతో పాటు వీధి బాలలను గుర్తిస్తున్నాం. ఇప్పటివరకు 15 మంది బాలురు, 6 మంది బాలికలు గుర్తించాం. వారికి సంరక్షణ కేంద్రాల్లో పునరావాసం కల్పిస్తున్నాం. మైనర్లను పనిలో పెట్టుకున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశాం. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను బడిలో చేర్పిస్తాం. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తున్నట్టు తెలిస్తే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు సమాచారం ఇవ్వాలి.

- లలిత కుమారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, సంగారెడ్డి

41 మంది పని పిల్లలను గుర్తించాం

● మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 41 మంది పిల్లలను పని ప్రదేశంలో గుర్తించామని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, బాలలను సంరక్షణ కేంద్రాల్లో చేర్చామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 8 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లడుతూ సిబ్బందికి సూచనలు చేశారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నెలాఖరు వరకు ముఖ్యంగా హోటళ్లు, ఇటుకబట్టీల్లో, నిర్మాణపనులు, వ్యాపార సముదాయాల్లో తనిఖీ చేసి, అక్కడ పనిచేస్తున్న బాలకార్మికులను గుర్తించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సీడీపీవో కరుణశ్రీ, చైల్డ్ వెల్ఫేర్ విభాగం అధికారి ఉప్పలయ్య పాల్గొన్నారు.

వివాదాస్పద భూములు.. యథేచ్ఛగా నిర్మాణాలు

కూల్చివేతకు హైకోర్టు ఆదేశం
అయినా.. అధికారుల జాప్యం
ఒకే భూమికి పలువురు యజమానులు

రామచంద్రాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో వివాదాస్పద భూముల్లో అక్రమ నిర్మాణాలు అడ్డూఅదుపూ లేకుండా కొనసాగుతున్నాయి. గతేడాది అక్టోబరులో హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా, వాటిని మున్సిపల్ అధికారులు బేఖాతరు చేశారు. సర్వే నంబరు 204లో నిర్మిస్తున్న ఓ నిర్మాణాన్ని కూల్చివేయాలని ఆదేశించినా, అధికారులు నేటికీ పట్టించుకోవడం లేదు. నిర్మాణదారుడు యథేచ్ఛగా తన పనిని కొనసాగించడం స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది.


సర్వే నంబరు 204లోని అక్రమ నిర్మాణ జీపీఏ చిత్రం

దశాబ్దాల వివాదం

కొల్లూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు 1985లో రైతుల నుంచి 204 సర్వే నంబర్‌లోని 21 ఎకరాల భూమిని జీపీఏ ద్వారా కొనుగోలు చేశారు. వారు అక్కడ లేఅవుట్ వేసి ప్లాట్లను విక్రయించారు. అయితే, ఈ ప్లాట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాలేదు. ప్లాట్లు కొన్నవారు వాటిని తమ స్వాధీనంలోకి తీసుకోలేదు. ఇదే అదనుగా, రైతులు తిరిగి రెవెన్యూ అధికారుల నుంచి తమ పేర్లతో పట్టాదారు పాస్‌బుక్‌లు పొందారు. ఆ తర్వాత, 1987 ఈ భూమిని మళ్లీ వ్యవసాయ భూమిగా ఇతరులకు విక్రయించారు. దీంతో ఒకే భూమికి పలువురు యజమానులు అయ్యి, వివాదాస్పద భూమిగా మారింది. ఈ విషయంపై కోర్టుల్లో వాదనలు కొనసాగుతున్నాయి.

హైకోర్టు ఆదేశాలు బేఖాతరు

ఇక్కడ ప్లాట్లు, వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన పలువురు తమ యాజమాన్య హక్కుల కోసం కోర్టులను ఆశ్రయించారు. రాజేష్ జైన్ అనే వ్యక్తి ఫిర్యాదుతో, వివాదాస్పద భూమిలోని అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినా, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా, నిర్మాణాన్ని కూల్చకుండా జాప్యం చేస్తున్నారు. కుంటిసాకులు చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు రాజకీయ నాయకుల అండదండలు దీని వెనుక ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. వివాదాస్పద భూములు ఎవరివి అనేది కోర్టు మాత్రమే తేల్చాలి. అలాంటిది, కోర్టు తీర్పు రాకుండానే నిర్మాణాలు చేపట్టి సమస్యను మరింత జటిలం చేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎక్స్‌కవేటర్ లోపలికి వెళ్లలేదు

సర్వే నంబరు 204లోని వివాదాస్పద భూమిలోని నిర్మాణాన్ని కూల్చడానికి సిబ్బందితో వెళ్లాం. కానీ రోడ్డు పక్కన ఉన్న వరద కాలువ అడ్డుగా ఉండటంతో ఎక్స్‌కవేటర్ లోపలికి వెళ్లలేకపోయింది. కూలీలతో కూల్చడానికి కూడా సాధ్యం కాలేదు. త్వరలోనే నిర్మాణాన్ని కూలుస్తాం.

- మహేష్, టీపీవో

మద్దూరు పాఠశాలకు పూర్వవైభవం

● 78 ఏళ్ల విద్యా నిలయానికి కొత్త ఊపిరి

మద్దూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : 78 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సిద్దిపేట జిల్లా మద్దూరు ఉన్నత పాఠశాల నేటి, భావి తరాలకు విద్యా నిలయంగా కొత్త ఊపిరి పోసుకుంటోంది. గతంలో మన ఊరు - మన బడి పథకం ద్వారా నిధులు మంజూరైనప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వంతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అయినప్పటికీ, పూర్వ విద్యార్థులు, దాతల చేయూతతో ఈ విద్యా మందిరం తిరిగి మెరుపులీనుతోంది, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు భరోసానిస్తోంది.


మద్దూరులోని 78 ఏళ్ల నాటి ప్రభుత్వ పాఠశాల

సువిశాల ప్రాంగణంలో నిర్మాణం

నిజాం పాలన కాలంలో, అంటే 1947లో అప్పటి వరంగల్ జిల్లా జనగామ తాలూకాలోని మారుమూల మద్దూరులో ఉన్నత పాఠశాల ప్రారంభమైంది. పది ఎకరాల విశాలమైన స్థలంలో 1950లో ఈ పాఠశాలకు పక్కా భవనం నిర్మాణం పూర్తయింది. 13 గదులతో నిర్మించిన ఈ పాఠశాల రాజసం ఉట్టిపడేలా ఉండేది. నీటి వసతి కోసం రెండు పెద్ద బావులను కూడా తవ్వించారు. పాఠశాల ప్రవేశ ద్వారం గుండా లోపలికి అడుగుపెట్టగానే ప్రధానోపాధ్యాయుల గది, దానికి ఇరువైపులా విద్యార్థులు ప్రవేశించేందుకు రెండు ద్వారాలు ఉంటాయి. లోపల సైన్స్ ల్యాబ్, విశాలమైన స్టాఫ్‌రూం, తరగతి గదులు, ఎగ్జామ్ రికార్డుల గది, అలాగే అడ్మినిస్ట్రేషన్ రికార్డులకు రెండు చిన్న గదులు కనిపిస్తాయి. ఇక్కడ విద్యాభ్యాసం చేసిన విద్యార్థులే కాదు, బోధించిన ఉపాధ్యాయులకు సైతం ఇది ఒక మధురమైన, చెరిగిపోని జ్ఞాపకమని నేటికీ చెబుతుంటారు. ప్రస్తుతం నిష్ణాతులైన ఉపాధ్యాయులచే కార్పొరేట్ స్థాయిలో డిజిటల్ ప్యానెల్ బోర్డుల ద్వారా విద్యాబోధన అందుతోంది.

అసంపూర్తిగా ఆధునీకరణ పనులు!

మన ఊరు - మన బడి పథకంలో భాగంగా ఈ పాఠశాల ఆధునీకరణకు రూ.54.31 లక్షలు మంజూరయ్యాయి. పాఠశాలకు కొత్త ఫర్నిచర్ సమకూరినప్పటికీ, కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్, టాయిలెట్లు, విద్యుదీకరణ పనులు మాత్రం అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేయగా, మౌలిక సదుపాయాల కోసం పాఠశాలకు రూ.2.95లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో మరుగుదొడ్లకు చిన్నచిన్న మరమ్మతులు చేయడంతో పాటు, పాఠశాలకు పెద్దగేటును నిర్మింపజేశారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయడంలో అలసత్వం నెలకొన్నది. ఉపాధ్యాయులు, దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలకు రంగులను వేస్తున్నారు.

అన్యాక్రాంతమైన పాఠశాల స్థలం

సువిశాలమైన పాఠశాల స్థలంలోనే పల్లె ప్రకృతి వనం, వన నర్సరీని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, వాటర్‌ప్లాంట్, వాటర్‌ట్యాంకు నిర్మాణం, ఆరోగ్య ఉపకేంద్రం వంటివి కూడా పాఠశాల ప్రాంగణంలోనే వెలిశాయి. ఇది పాఠశాల స్థలం అన్యాక్రాంతం కావడానికి దారితీస్తోంది. భవిష్యత్ అవసరాల కోసం పాఠశాల స్థలాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బడిలో పనిచేయడం గొప్ప అనుభూతి



మాది లద్నూరు గ్రామం. ఇక్కడే చదువుకున్నాం. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా మహబూబ్‌బాద్‌లో పనిచేస్తున్న సమయంలో మా గ్రామానికి చెందిన వ్యక్తి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తూ ఉండేవారు. ఆయన నా పరిస్థితిని గమనించి 1985లో మద్దూరు పాఠశాలలకు బదిలీపై పంపించారు. 1991 వరకు ఇంగ్లీషతో పాటు ఉర్దూ బోధించాను. ఈ పాఠశాలలో ఆరేళ్ల పాటు చదువుచెప్పడం ఎంతో గొప్ప అనుభూతినిచ్చింది.

-రామ్మూర్తి, పూర్వ ఉపాధ్యాయుడు

దాతల సహకారం కావాలి



సుదీర్ఘ చరిత్ర గల పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు దాతలు ఉదారతను చాటుకోవడంతో పాఠశాలకు మెరుగులద్దుతున్నాం. కార్పొరేట్ స్కూళ్లలా మారింది. కొద్దిపాటి పనులైన వరండాతో పాటు కొన్ని గదులకు, కిటికీలకు, చెక్క బీరువాలకు పెయింటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. పూర్వ విద్యార్థులతో పాటు దాతలు సహకరిస్తే ముందు తరాలకు ఉపయోగపడే చక్కటి విద్యానిలయంగా ఉంటుంది.

-చంద్రశేఖర్‌శర్మ, ప్రధానోపాధ్యాయుడు

న్యూస్ బాక్స్

9 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి గత కొన్ని రోజుల క్రితం నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ ఆఫీస్ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 9 మందిని పట్టుకున్నారు. వారిని గురువారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా, విచారణ చేసి 9 మందికి రూ.21,500 జరిమానా విధించారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ

నంగునూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నంగునూరు బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 63 మంది విద్యార్థులకు గురువారం నల్ల గోవిందరాజులు, కావేరి దంపతులు సుమారు రూ.40వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యా అధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు దాతలు చేయూత అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జైపాల్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీలత, నాయకులు రచ్చ సిద్ధు, దాసరి రవి, టీచర్స్ కవిత, నాగలత సీఆర్పీ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

షూ, సాక్స్..

మద్దూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండా డీఎస్‌టీ కూటిగల్ తండాలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు కీర్తిశేషులు కమలాబాయి జ్ఞాపకార్థం ఆమె కుమారులు ధరావత్ నిమ్మనాయక్, రవీందర్ నాయక్, రమేష్ నాయక్ , రాకేష్ బ్లాక్ షూ, సాక్స్ అందజేశారు. అలాగే బెక్కల్ గ్రామ పాఠశాలలో లకావత్ రజిత, దేవేందర్ నాయక్ దంపతుల కుమార్తె పుట్టిన రోజును పురస్కరించుకుని ప్యూరిఫైర్ వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు.

టీవీ బహూకరణ

రాయపోల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం రూ.27వేల విలువైన టీవీని పాఠశాలకు బహూకరించారు. ఎంఈఓ సత్యనారాయణరెడ్డి టీవీని ప్రారంభించారు. ఉపాధ్యాయుడిని ఎంఈఓ అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినికి ఆర్థిక సాయం

చేర్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్ విద్యార్థిని నిమ్మ చందన రాజీవ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఆమెను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ బృందం రూ.7వేల ఆర్థిక సహాయం అందజేసింది.

ఆయా లేక అంగన్‌వాడీ పిల్లలకు ఇబ్బందులు

గజ్వేల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలలో ఆయా లేకపోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. గజ్వేల్ మండలం అనంతరావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగేళ్లుగా ఆయా లేకపోవడంతో వంటకు, వాష్‌రూమ్‌కు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాష్‌రూమ్, నీటి సమస్య వల్ల పిల్లలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, మలమూత్ర విసర్జనకు బయటకు వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలను చూసుకునేందుకు వీలుగా వెంటనే ఆయాను నియమించాలని డిమాండ్ చేశారు.

చక్కని చేతిరాత అందరికీ సాధ్యమే

మర్కుక్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శ్రద్ధ పెడితే చక్కని చేతిరాత అందరికీ సాధ్యమేనని ప్రముఖ చేతిరాత నిపుణుడు, మోటివేషనల్ స్పీకర్ ఎజాజ్ అహ్మద్ అన్నారు. దామరకుంటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు బాల్య దశ నుంచే మంచి చేతిరాతను అలవర్చుకుంటే పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవడమే కాకుండా వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి జీవితంలో ఉన్నత స్థితికి ఎదుగుతారని అన్నారు.

మానవహారం కరపత్రం విడుదల

చేర్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16 న స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టనున్న మానవహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం పాత బస్టాండ్ చౌరస్తా వద్ద కరపత్రం విడుదల చేశారు. జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.



రామసముద్రం చెరువు వద్ద ఓపెన్ జిమ్‌లో చిందరవందరగా ప్లాట్‌ఫాం ప్యాడ్స్



దుబ్బాక ఏదుల్లా చెరువు సమీపంలోని ఓపెన్ జిమ్ చుట్టూ పెరిగిన గడ్డి



దుంపలపల్లివార్డు పెద్దచెరువు వద్ద ఓపెన్ జిమ్ దుస్థితి

ఓపెన్ జిమ్‌లకు సుస్తీ..

దుబ్బాక, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ పరిధిలో వాకర్స్, వ్యాయామదారుల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు నిర్వహణ లోపంతో మూలనపడుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో గడ్డి పెరిగి, పురుగులు, పాములకు నిలయంగా మారుతున్నాయి. జిమ్ ప్లాట్‌ఫాంపై వేసిన ప్యాడ్‌లు, టైల్స్ లేచి వ్యాయామం చేయడానికి వచ్చేవారికి ఇబ్బందిగా మారింది. రామసముద్రం చెరువు కట్టపై రూ.25 లక్షలతో సీఎండీపీ నిధులతో ఏర్పాటు చేసిన జిమ్ పూర్తిగా పాడైంది. అలాగే పెద్దచెరువు, ఏదుల్లాచెరువు సమీపంలో దర్మాజీపేట, మల్లాయపల్లి, చేర్వాపూర్ వార్డుల్లో ఏర్పాటు చేసిన జిమ్‌లు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నాయి. కనీసం గడ్డి తొలగించి, చిన్నపాటి మరమ్మతులు చేస్తే, వాకర్స్, వ్యాయామం చేసేవారికి ఉపయోగపడుతాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పెచ్చులూడుతున్న గదిని ఖాళీ చేయాలి

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తిగుల్ నర్సాపూర్ పాఠశాలలోని పెచ్చులూడుతున్న గదిని పరిశీలిస్తున్న డీఈవో

జగదేవ్‌పూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ ప్రాథమిక పాఠశాల భవనంలో పెచ్చులూడుతున్న గదిని ఖాళీ చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'తడబడి' అనే శీర్షికన జిల్లాలోని పలు పాఠశాలల పరిస్థితిపై వచ్చిన కథనంలో తిగుల్ నర్సాపూర్ పాఠశాల భవనం పెచ్చులూడుతోందని వార్త ప్రచురితమవగా, డీఈఓ స్పందించి పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం అయినందున విద్యార్థులను ఎవరినీ ఈ గదిలో కూర్చోనివ్వవద్దని, వేరే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధించాలని సూచించారు. ఈ పాఠశాలకు అదనపు తరగతి గది మంజూరు కోసం జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే మంజూరు అవుతుందని తెలిపారు. అదే విధంగా గొల్లపల్లి, మోడల్ పాఠశాల హాస్టల్‌ను డీఈవో సందర్శించారు. విద్యాబోధన, వసతుల గురించి అడిగి తెలుసుకొని హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

గజ్వేల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మండలానికి వడ్డీ లేని రుణాలుగా 669 సంఘాలకు రూ.1.60 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రూ.11 లక్షలు మేక పొట్టేళ్లు, పెరటి కోళ్ల కోసం మంజూరయ్యాయని, వీటితో పాటు మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు మంజూరయ్యాయని చెప్పారు. అర్ధాంతరంగా మరణించిన మహిళా సభ్యులకు లోన్ బీమా రూపంలో రూ.1.52 లక్షలు జమ అయ్యాయని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్గాప్రసాద్, మాజీ ఎంపీటీసీ తుప్పతి అంజయ్య, నక్క రాములు, రమేశ్, బాల్‌నర్సు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, సీసీలు కృష్ణలీల, పుష్పలత, నిర్మల, శ్రీనివాస్, నాగరాజు, స్వామి, వీఓలు రేణుక, స్వప్న, శ్రీలత, రాధిక గ్రామైఖ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మిరుదొడ్డిలో ఇందిరామహిళాశక్తి సంబురాలల్లో అధికారులు

- మిరుదొడ్డి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని రైతు వేదిక వద్ద గురువారం ఇందిరా మహిళా శక్తి సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీపీఎం వాసుదేవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 882 మహిళా సంఘాలకు రూ.2 కోట్ల వడ్డీ లేని రుణాలను జమచేసినట్లు తెలిపారు. అనంతరం కళాప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాకంబరిగా విజయ దుర్గ మాత



కొండపాక, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో వ్యాస పౌర్ణమి వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు, దేవి ఉపాసకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో క్షేత్రంలో ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విజయదుర్గ మాత శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా నవావరణ హవనము, హోమం, మహిళలచే సామూహిక లలిత సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి జరిగింది. సాయంత్రం గురు పౌర్ణమి సందర్భంగా దేవి ఉపాసకులు హరినాథ శర్మకు పాదపూజ, గురు సత్కారం నిర్వహించారు.

'కొండపోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషి'



కొండపోచమ్మ నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

జగదేవ్‌పూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, దాతల సహకారంతో కొండపోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కొండపోచమ్మ పాలక మండలి నూతన చైర్‌పర్సన్ కప్పర అనుగీత అన్నారు. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. నూతన సభ్యులందరూ అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో అనుగీతను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఈఓ రవికుమార్ చైర్‌పర్సన్‌తో పాటు పాలకమండలి సభ్యులను సత్కరించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయాలి

- మంత్రికి బార్ అసోసియేషన్ వినతి



మంత్రి పొన్నంకు వినతిపత్రం సమర్పిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

హుస్నాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఒగ్గోజు సదానందం, మాజీ ఏజీపీ కన్నోజు రామక్రిష్ణ, న్యాయవాదులు మిట్టపల్లి ఎల్లారెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులున్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి

గజ్వేల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని గజ్వేల్ ప్యాక్స్ చైర్మన్ జేజాల వెంకటేశ్ గౌడ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సీఈఓ బాలయ్య సహా పలువురు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాలను సద్వినియోగం చేసుకోవాలి

- నాబార్డ్ డీడీఎం నిఖిల్‌రెడ్డి

మద్దూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైతులు సహకార సంఘాల ఆధ్వర్యంలో ఆర్థికంగా బలోపేతం కావాలని నాబార్డ్ డీడీఎం నిఖిల్ రెడ్డి తెలిపారు. మండలంలోని రేబర్తి సహకార సొసైటీలో అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం సొసైటీ ఆవరణలో మొక్కలు నాటారు. అధ్యక్షులు తిరుపతిరెడ్డి, డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, నర్మెట్ట బ్రాంచి సూపర్‌వైజర్ రాము, సీఈవో శ్రీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు

చేర్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చేర్యాల మండలంలో ఓ ఎంపీటీసీ స్థానం పెరగనుంది. మద్దూరు మండలంలో కొనసాగుతున్న అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామాలను చేర్యాల మండల పంచాయతీరాజ్ పరిధిలో ఇటీవల విలీనం చేసిన నేపథ్యంలో ఆయా గ్రామాల పరిధిలోని 1 ఎంపీటీసీ స్థానాన్ని చేర్చారు. దీంతో చేర్యాల మండలంలోని 18 గ్రామాలలో 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఇకనుంచి 20 గ్రామాలకు పెరిగి 12 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. గతంలో ఉమ్మడి చేర్యాల మండలంలో 21 ఎంపీటీసీ స్థానాలుండగా, చేర్యాలను మునిసిపాలిటీగా మార్చడంతో 4 స్థానాలు, కొమురవెల్లిని మండలంగా ఏర్పాటు చేయడంతో 6 స్థానాలు తగ్గి 11 ఎంపీటీసీలతో కొనసాగుతుంది. ఇటీవల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ అభ్యంతరాలేవీ లేకపోవడంతో రానున్న ఎన్నికలు చేర్యాల మండల పరిషత్‌లో చేరనున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీ అందజేయాలి : యూటీఎఫ్

గజ్వేల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్‌సీని అందజేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వి. సత్యనారాయణ డిమాండ్ చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని ఆయా పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆర్థిక సమస్యలైన పెండింగ్ డీఏలు, పీఆర్‌సీని వెంటనే ఇవ్వాలన్నారు. ఎస్జీజీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని, పాఠశాలల్లో పీఎస్ హెచ్‌ఎం పోస్టులు పదివేలు ఇవ్వాలని, ఎస్జీఈటీ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని, జీవో 317 బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈవోపై దాడి హేయనీయం

- విశ్వబ్రాహ్మణ సంఘం

కొండపాక, జూలై 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో లాలూకోట రమాదేవిపై దాడి చేయడం హేయమైన చర్య అని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం నాయకులు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి భూర్గోజు బాలబ్రహ్మం సహా పలువురు నాయకులు గురువారం కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. భద్రాచలం ఆలయ భూములు పరిరక్షించేందుకు పురుషోత్తమ పట్టణానికి పరిశీలనకు వెళ్లిన మహిళా అధికారిపై దాడి చేయడం అమానుషమని పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని, మహిళా అధికారికి పూర్తి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నానో యూరియాతో లాభాలు

- ఏఓ వసంతరావు

జగదేవ్‌పూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియాతో అనేక లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ రైతు వేదికలో ఆయన మాట్లాడారు. నానో యూరియాను ఆకులపై పిచికారి చేయడం వల్ల మొక్కలు పోషకాలను సమర్థవంతంగా గ్రహించి పంట దిగుబడి 8 శాతం వరకు పెరుగుతుందని తెలిపారు. తక్కువ మొత్తంలో యూరియాతో భూగర్భ జలాల్లోకి నత్రజని చేరడం తగ్గి పర్యావరణ కాలుష్యాన్ని నివారిస్తుందని పేర్కొన్నారు.

అందుబాటులో యూరియా

మిరుదొడ్డి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియాను అందుబాటులో ఉంచినట్లు దుబ్బాక వ్యవసాయ సంచాలకులు మల్లయ్య అన్నారు. గురువారం మిరుదొడ్డిలోని పీఏసీఎస్ సహకార సంఘం వద్ద రైతులకు విక్రయిస్తున్న యూరియాను పరిశీలించారు. యూరియాను మోతాదుకు మించి వాడకూడదని, దీని వల్ల భూమి దెబ్బతింటుందని తెలిపారు.

ఘనంగా చండీ హోమం

హుస్నాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గురువారం చండీ హోమం నిర్వహించారు. అలాగే పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలుర వసతిగృహం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దుబ్బాక, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలోని జ్యోతిరావు పూలే బాలుర వసతిగృహాన్ని గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సందర్శించారు. హాస్టల్‌లోని భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధనను, ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతుల కోసం తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట దుబ్బాక తహసీల్దార్ సంజీవ్‌కుమార్ తదితరులున్నారు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేయాలి

- డీఐఈవో రవీందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్‌రెడ్డి

నంగునూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న బోధన తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించి అడ్మిషన్లు పెరిగే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత అధ్యాపకులదేనని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం



చేర్యాలతో భూమిపూజలో జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వమే సాకారం చేస్తుందని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎవరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలనలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, నాయకులు దాసరి కళావతి, పుర్మ ఆగం రెడ్డి, తడక లింగం, పాల లక్ష్మీనారాయణ, వంగ జయ, మంచాల చిరంజీవులు, ఆడెపు చంద్రయ్య, ఆడె పు నరేందర్, మామిడాల నాగరాజు, నీలం సన్నీ, అంబాల రాము లు అందె నాని పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాటం

- సీఐటీయూ



విలేకరులతో మాట్లాడుతున్న ఎల్లయ్య

గజ్వేల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మికుల పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. గజ్వేల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసిన కార్మికులకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 282ను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బండ్ల స్వామి, రంగారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేత



సిద్దిపేట కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట వేంకటేశ్వర స్వామి పాత దేవస్థానం అధ్యక్షుడు డా. నవీన్ కుమార్ తన తండ్రి మంకాల భిక్షపతి జ్ఞాపకార్థం పట్టణానికి చెందిన ఓ మహిళకు కుట్టు మిషన్ అందజేశారు.

'కల్లు' తేలేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

కొన్ని దుకాణాల్లో స్వచ్ఛమైన కల్లును అందిస్తున్నట్లుగా చెబుతున్నారు.

బానిసలుగా మారుతూ..

రసాయనాలు కలిపిన కల్లుకు చాలామంది బానిసలుగా మారుతున్నారు. కల్లు తాగనిదే తమ రోజువారి జీవితాన్ని ప్రారంభించనివారు ఎందరో ఉంటున్నారు. కల్లు తాగకుంటే సైకోలుగా ప్రవర్తించే వాళ్లు లేకపోలేదు. దీర్ఘకాలికంగా కల్తీ కల్లుకు బానిసలైన వారు ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఇలాంటి వారిలో చైతన్యం నింపాల్సిన అధికార గణం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. కల్లు విక్రయదారులకు కాసులు కురుస్తుంటే బాధితుల ఆరోగ్యం కుళ్లిపోతున్న పరిస్థితి నెలకొన్నది. హైదరాబాద్‌లో తాజాగా జరిగిన ఘటనలో కల్తీకల్లు ఆరుగురిని బలితీసుకొంది. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రామానికో ఆదర్శ రైతు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వానికి చెడ్డ పేరుతో పాటు రైతులు నష్టపోయే అవకాశం ఉంది.

జిల్లాలో 499 మంది ఆదర్శ రైతులు

జిల్లాలో మొత్తం 5.40లక్షల ఎకరాల్లో ఆయా రకాల పంటలను సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న ఆదర్శరైతు వ్యవస్థతో జిల్లాలో 499 మంది ఆదర్శ రైతులు రానున్నారు. గ్రామానికి ఓ ఆదర్శ రైతును నియమించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఆదర్శ రైతు వ్యవస్థ ద్వారానే మరోసారి ప్రభుత్వ పథకాలను అందజేయనున్న నేపథ్యంలో పారదర్శకంగా పథకాలను అమలు చేస్తారా? లేదంటే కార్యకర్తలకే పథకాలను వర్తింపజేస్తారా అన్న అన్న అంశం త్వరలో స్పష్టత రానుంది. గతంలో గ్రామంలో జనాభా ప్రకారం ఒకరు, ఇద్దరు లేదా ముగ్గురిని నియమించారు. ప్రస్తుతం ఒక్కరికే అవకాశం ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఆదర్శ రైతులుగా నిజమైన రైతులను ఎంపిక చేస్తారా... లేక కాంగ్రెస్ కార్యకర్తలనే నియమిస్తారా చూడాలి. ఏదేమైనా ఆదర్శ రైతు వ్యవస్థను తెస్తామన్న ప్రకటనతో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఒక్కసారిగా ఆనందం వెల్లివిరుస్తుంది.